క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన


వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ డీపీఎం సత్యనారాయణ

రాజోలు: అగ్రికల్చరల్ ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా రామేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం, వేగివారిపాలెం తాటిపాక గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి వ్యావసాయ పద్ధతులను ఆచరిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వ్యవసాయం చేసే విధానాలు దానికి కావలసిన ముడి పదార్థాల సేకరణపై ఫీల్డ్ విజిట్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ డీపీఎం సత్యానారాయణ, ఎన్ఎఫ్ హేమలత, హెచ్ఆర్ జోన్స్ విద్యార్థులకు ప్రాజెక్టు వివరాలను తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఏఎ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు డి.కిరణ్‌కుమార్, రాజేష్ ప్రదీప్, సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ తులసిరావు, వ్యవసాయ క్షేత్ర సిబ్బంది జోసెఫ్, శ్రీనివాస్, జూలీ, చిట్టి స్వరాజ్, మల్లికా ప్రసన్నకుమార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన


వేగివారిపాలెంలో క్షేత్ర పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

సఖినేటిపల్లి: రామేశ్వరం జెడ్పీపీహెచ్ఎస్ (ప్లస్) విద్యార్థులు శుక్రవారం అగ్రికల్చరల్, ఇండస్ట్రియల్ క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. పాఠశాల హెచ్ఎం ఎంజీకే శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలో భాగంగా వేగివారిపాలెంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రూపొందిన ఏటీఎం (కావాల్సిన వెంటనే రైతు చేతికి ఆదాయం)ను చూపించారు. వీటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. తాటి పాకలో వరి సాగులో చీడపీడలు నివారణకు వేప కషాయం ప్రాధాన్యతను వివరించారు. టీచర్లు రాజేష్, ప్రదీప్, సుబ్రహ్మణ్యం, కిరణ్ కుమార్, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాపాక


రాపాక దుర్గారామ చంద్రమూర్తి

ఆత్రేయపురం: మండలం డిప్యూటీ తహసీల్దారుగా రాపాక దుర్గారామచంద్రమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కొత్తపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ ఇస్మాయిల్ అంబాజీపేట సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఆత్రేయపురం ఆర్ఐగా ఎమ్.బాను బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఆర్ఐగా పనిచేసిన డి.భవానీ కొత్తపేట తహసీల్దారు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం

పి.గన్నవరం: నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమంలో శంకుస్థాపన చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసి, సంక్రాంతిలోగా ప్రారంభించేలా కృషి చేయాలని అన్నారు. డీఈఈ చంద్రశేఖర్, జేఈలు కె.ఆనంద్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు


గన్ని కృష్ణారావు (ఫైల్)

ఆలమూరు: చింతలూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న గన్ని కృష్ణారావు (74) గురువారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై ఎం,అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణారావు ఆచూకీ లభిస్తే 63020 57258 లేదా 94409 04849 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గన్ని కృష్ణారావు (74) అదృశ్యమయ్యాడు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఆలమూరు: చెముడులంకకు చెందిన బాలిక (16) అదృశ్యమైంది. స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 23న తన స్నేహితురాలితో కలిసి పాఠశాలకు బయలుదేరింది. కానీ పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకపోకపోవడంతో తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్ ఆక్రమణ.. ఆధునీకరణలో జాప్యం

- గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు
- ఎన్నికల కోడ్ కారణంగా పనులకు అంతరాయం
- రెండు గ్రామాలను కలుపుతూ గతంలో డ్రెయిన్ నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో చొరవ చూపని వైనం


ఉయ్యూరువారి మెరక గ్రామ పరిధిలో డ్రెయిన్ దుస్థితి


మోరి గ్రామ పరిధిలో శివాలయం, ఇళ్ల మధ్య డ్రెయిన్‌లో వేసిన ఇసుక మేట

సఖినేటిపల్లి: మండల పరిధిలోని మోరి, ఉయ్యూరువారి మెరక గ్రామాల మధ్య పూర్వకాలంలో ఏర్పాటు చేసిన మోరి డ్రెయిన్ మరమ్మతులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో ఎన్నికలకు రెండు నెలలు ముందు ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రూ.86 లక్షలు మంజూరై సిద్ధంగా ఉన్నాయి. పనులకు శంకుస్థాపన కూడా అప్పటి పాలకులు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన పనులు త్వరితగతిన చేపట్టాలని పై రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెండు కిలోమీటర్ల మేర డ్రెయిన్

మోరి, ఉయ్యూరువారి మెరక గ్రామాలను కలుపుతూ సుమారు రెండు కిలోమీటర్ల మేర డ్రెయిన్ విస్తరించి ఉంది. డ్రెయిన్ పొడవునా చాలా చోట్ల ఆక్రమణలతో కుచించుకుపోయింది. మరికొన్ని చోట్ల పూడుకుపోయి రూపురేఖలే మారాయి. గతంలో డ్రెయిన్‌కు రెండు గ్రామ పంచాయతీలు కొంత మేర మరమ్మతులు చేపట్టినా అవి తాత్కాలిక ఉపశమనంగా మారాయి. డ్రెయిన్‌లో వేస్తున్న ఇసుక మేటల కారణంగా మురుగునీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు.

మూసుకుపోయిన అవుట్‌లెట్

మోరిలోని మొండికోడు ఛానల్ వద్ద డ్రెయిన్ తెరుచుకునే ప్రాంతంలో పక్కా అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పూర్వం నుంచి డ్రెయిన్‌కు మొండికోడు ఛానల్‌లోకి ఉన్న అవుట్‌లెట్ దారి అంతా పిచ్చి మొక్కలతో పూర్తిగా మూసుకుపోయి అధ్వానంగా మారింది. దీంతో ఛానల్‌లోకి మురుగు నీరు దిగడానికి ఆటంకంగా ఉంది. దీనికి తోడు భారీ వర్షాల సమయాల్లో అవుట్‌లెట్ వద్ద సైఫన్ లేకపోవడంతో ఛానల్‌లోకి దిగాల్సిన మురుగు నీటికి, వర్షం నీరు తోడై డ్రెయిన్ ద్వారా పోటెత్తి పల్లపు ప్రాంతాలకు చేరుతోంది.

శివాలయంలోకి మురుగునీరు

డ్రెయిన్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులున్న తరుణంలో డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న శివాలయం ఆవరణలోకి మురుగునీరు చేరుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం నుంచి ఏర్పాటు చేసిన అవుట్‌లెట్ తూరల ద్వారా డ్రెయిన్‌లోని మురుగునీరు ప్రాంగణంలోకి పోటెత్తి తీవ్ర అసౌకర్యంగా ఉంటోందని వారు వాపోయారు.

ఉపయోగపడని తూరల కల్వర్టు

మోరి ప్రధాన రహదారిలో డ్రెయిన్‌కు శిథిలస్థితికి చేరుకున్న సిమెంటు తూరలు స్థానే గతంలో మరలా కొత్త తూరలు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టు వద్ద తూరలలో ఇసుక చేరడంతో నీటి ప్రవాహం నిలిచింది. అలాగే చెత్తాచెదారం పేరుకుపోవడంతో తూరల వద్ద మార్గం బంద్ అయింది. తూరల కల్వర్టుకు ప్రత్యామ్నాయంగా శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తేనే మున్ముందు మురుగు నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉండదని స్థానికులు చెబుతున్నారు.

ఏకకాలంలో మరమ్మతులు చేపట్టాలి



డ్రెయిన్ పొడవునా మరమ్మతులు ఏకకాలంలో చేపట్టాలి. దశల వారీగా చేపట్టిన పనులు వల్ల ఉపయోగం లేదు. అరకొర పనులతో వర్షం కురినప్పుడు సమస్య యధాతథంగా ఉంటోంది.

– బూశిం చినబాబూరావు, ఉపసర్పంచ్, మోరి

అవుట్‌లెట్‌కు సైఫన్ నిర్మించాలి



మొండికోడు ఛానల్ వద్ద డ్రెయిన్ అవుట్‌లెట్‌కు పక్కా సైఫన్ నిర్మించాలి. సైఫన్ లేకపోవడం వల్ల మురుగు నీరు వెనక్కి వస్తోంది.దీంతో పల్లపు ప్రాంతాలు మునిగిపోతున్నాయి.

– అయిలూరి కామేశ్వరరావు, గ్రామస్తుడు, మోరి

ఉపాధిహామీ పథకంలో నిధుల మంజూరు



గత ప్రభుత్వం హయాంలో డ్రెయిన్ మరమ్మతులకు ఉపాధిహామీ పథకంలో రూ.86 లక్షలు మంజూరయ్యాయి. శంకుస్థాపన పనులు కూడా పూర్తి చేశాం. ఎన్నికల కోడ్ వల్ల పనులు మొదలు కాలేదు.

– పనలపూడి లక్ష్మి పద్మ మంగతాయారు, సర్పంచ్, మోరి

స్థానిక డ్రెయిన్‌గానే పరిగణించాలి

మోరి డ్రెయిన్‌ను లోకల్ డ్రెయిన్‌గానే పరిగణించాలి. డ్రెయిన్ నిర్వహణ పంచాయతీల అధీనంలో ఉంటుంది. తమ శాఖ పరిధిలో లేదు.

– రేష్మ, డ్రెయిన్స్ ఏఈ, రాజోలు

అపార్‌ను వేగవంతం చేయండి


గంటి ఉన్నత పాఠశాలలో అపార్ ప్రగతిని పరిశీలిస్తున్న డీసీ మధుసూదన్‌రావు

కొత్తపేట: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)ను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని గంటి జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఎస్ఎస్ఏ డీసీ మధుసూదన్‌రావు సందర్శించారు. ముందుగా పాఠశాల విద్యార్థుల హాజరు, మంచినీరు, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంటశాలను, పరిసరాలను పరిశీలించారు. వండిన అన్నం, కూరలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. అపార్ డేటా ప్రోగ్రెస్‌ను ఇన్‌చార్జ్ హెచ్ఎం బండారు శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అపార్ డేటాను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బి. సుబ్రమణ్యం ఉన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈఓపీఆర్‌డీ ఏ రాజు, ఏఓ మెహెర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గురు పుష్యయోగ హోమం

కొత్తపేట: లోక కల్యాణార్థం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో గురు పుష్యయోగ (దేశీయ ఆవుపేట పిడకలు, ఆవు నెయ్యితో) హోమం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పలివెల ఉమా కొప్పేశ్వర మాసశివరాత్రి కమిటీ సభ్యుడు సలాది రామమోహనరావు (చిన్ని) ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి కనకదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చక వంశీకులు గోఉపాసక శ్రీసుభిదాస్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్ పాల్గొన్నారు. శనివారం త్రయోదశి తిథికి ఎంత విశేషం ఉన్నదో అదేవిధంగా గురువారం పుష్యమీ నక్షత్రానికి అంత విశేషం ఉందని పండితులు శ్రీసుభిదాస్ తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో కేవలం రెండే రెండుసార్లు గురువారం పుష్యమీ నక్షత్రం ఘడియలు కలిసి వచ్చాయన్నారు. వచ్చే కార్తీకమాసంలో నవంబరు 21న (గురువారం) పుష్యమీ నక్షత్ర ఘడియలు కలిసి వచ్చాయని తెలిపారు. గురు పుష్యయోగ హోమం నిర్వహించిన వారికి, పాల్గొన్నవారికి ఎంతో పుణ్య ఫలం లభిస్తుందని దాస్ తెలిపారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కొత్తపేటలో గురు పుష్యయోగ హోమం నిర్వహిస్తున్న దాస్, శిల్పి వుడయార్, నిర్వాహకుడు చిన్ని

కడుపు నింపని చేతి వృత్తులు

- చేతి వృత్తిదారులు తయారు చేసే వస్తువులకు ఆదరణ కరవు
- రెడీమేడ్‌పై చిచ్చుబుడ్లు, ప్రమిదలపై కొనుగోలుదారుల ఆసక్తి


సారెపై మట్టితో ప్రమిదలు తయారు చేస్తున్న దృశ్యం


మట్టితో తయారు చేసిన ప్రమిదలు, చిచ్చుబుడ్లు

మామిడికుదురు: ప్రతి ఇంట వెలుగులను నింపే దీపావళి పండుగ వస్తోంది అంటే మూడు, నాలుగు నెలల ముందు నుంచే కుల వృత్తిపైనే ఆధారపడ్డ కుమ్మర్లు చిచ్చుబుడ్లు, ప్రమిదల తయారీలో బిజీగా ఉండేవారు. వీటి తయారీ ద్వారా గతంలో కుమ్మర్లకు తగిన ఆదాయం లభించేది. ప్రతి ఇంట్లో వెలుగులు నింపుతున్న దీపావళి ప్రస్తుతం చేతివృత్తిదారులకు మాత్రం వెలుగులు ప్రసాదించడం లేదు. పూర్వం కేవలం మట్టితో తయారు చేసిన చిచ్చుబుడ్లు, ప్రమిదలు మాత్రమే అందుబాటులో ఉండేవి. వాటినే విధిగా వాడేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిస్కోబుడ్లు, రెడీమేడ్ ప్రమిదలు అందుబాటులోకి రావడం స్థానికంగా తయారు చేసే వాటికి గిరాకీ తగ్గింది. చూడ్డానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండే రాజస్థాన్ ప్రమిదలు, ఫ్యాన్సీ దీపాలు, ప్లాస్టిక్ చిచ్చుబుడ్ల పట్ల యువత ఆసక్తి చూపడంతో కుమ్మర్లు తయారు చేసిన వాటికి దాదాపు ఆదరణ తగ్గిపోవడంతో క్రమేపీ తయారీ కూడా తగ్గుముఖం పట్టింది.

మట్టి ప్రమిదలకు గతంలో గిరాకీ

మండలంలోని అప్పనపల్లి, పెదపట్నంలంక, లూటుకుర్రు, బి.దొడ్డవరం, కొమరాడ, ఈదరాడ, పెదపట్నం, తదితర గ్రామాల్లో కుమ్మర్లు వీటి తయారీలో బిజీగా ఉండే వారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. పూర్వం నుంచి కుల వృత్తినే నమ్ముకున్న వారు తప్ప యువత అంతా ఇతర రంగాల వైపు మొగ్గు చూపడంతో మట్టి ప్రమిదలు, స్థానికంగా తయారయ్యే చిచ్చుబుడ్లు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీపావళి పండుగకు రెండు నెలల ముందు నుంచి ప్రమిదలు, చిచ్చుబుడ్లు తయారు చేస్తూ కుమ్మర్లు ఉపాధి పొందే వారు.

పెద్ద తరం వారు మాత్రం నెల రోజులు నుంచి వీటిని తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక వీటిని తయారు చేస్తున్నామని దశాబ్దాలుగా కుల వృత్తినే నమ్ముకున్నానని అప్పనపల్లికి చెందిన పేరూరు బూరియ్య తెలిపారు. రోజంతా కష్టపడినా రూ.300 కూడా రావడం లేదని ఆయన అన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


మేడిచర్లపాలెంలో దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ వల్లీశ్వరి, అధికారులు

మలికిపురం: మేడిచర్లపాలెంలో శుక్రవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు మందు వీధుల్లో పారిశుధ్య కార్మికులు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మురుగునీటి కుంటలు లేకుండా శ్రద్ధ వహించాలన్నారు. చెత్తను పంచాయతీ సిబ్బందికి అందుబాటులో ఉంచాలని ఇష్టానుసారంగా ఆరుబయట పారబోయవద్దని చెప్పారు. ఈవోపీఆర్డీ ఎ.మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీహరి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

రాజోలు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీల్లోని పెట్టుబడి సాయం అందించాలన్నారు. కౌలు రైతులకు రక్షణ చట్టాన్ని తీసుకుని రావాలని కోరారు. మండలంలోని కడలి, వేగివారిపాలెం, చెన్నడం గ్రామాల్లో కౌలు రైతు సంఘ నాయకులు సమావేశాలు నిర్వహించి కౌలు రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సొంత పూచీకత్తుతో కౌలు రైతులకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ముంపునీరు దిగేందుకు వీలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థ ఉండడంతోపాటు రొయ్యల, చేపల చెరువుల సాగు కారణంగా పంట పొలాలు ముంపునకు గురవుతున్నట్టు గుర్తించామన్నారు. ఖరీఫ్ పంట సాగు చేయని రైతులకు రూ.25 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, వాసంశెట్టి బాలకృష్ణ, మామిడిశెట్టి నాగరాజు, రాపాక రమేష్‌బాబు, గిడుగు గణేష్, బండారు సాయి సత్య రామారావు, కాంగ్రేగుల రామారావు పాల్గొన్నారు.


వేగివారి పాలెంలో కౌలురైతు సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



బిళ్లకుర్రు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను సక్రమంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు రెవెన్యూ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని బిళ్లకుర్రులో గ్రామస్థాయి భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షత నిర్వహించిన సభలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్రిటీష్ గవర్నమెంట్ తరువాత ఏ ప్రభుత్వమూ భూ సమస్యలను పరిష్కరించని పరిస్థితుల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూముల రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ కార్యక్రమంలో ఎన్నో భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలను జాప్యం చేయకుండా రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని కోరారు. అనంతరం మండల ఆర్ఐపీ రవిశంకర్, మండల సర్వేయర్ జేకేడీ ప్రసాద్ భూమి కొలతల్లో వ్యత్యాసం, పాస్‌బుక్స్ వంటి వివిధ భూ సమస్యలను పలువురు రైతులు గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలపై 73 ఆర్జీలు అందినట్టు ఆర్ఐ రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిత్రపు ఆనందరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొక్కా లోకేష్, మాజీ సర్పంచ్ ఎంఎస్ ప్రసన్నవర్మ, గ్రామ కార్యదర్శి ఎంవీవీఎస్ శ్రీనివాసరావు, వీఆర్ఓ ఏసు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉత్తమ మార్గాన్ని ఎంచుకోవాలి

కొత్తపేట: యువత ఉన్నత భవిష్యత్ సాధనకు ఉత్తమ మార్గాన్ని ఎంచుకోవాలని స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.సురేంద్ర సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రమశిక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎస్సై సురేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కొందరు యువకులు చెడు వ్యసనాలకు ముఖ్యంగా ఇటీవల మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్‌తో పాటు తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తమ తల్లిదండ్రులను, తమ ఉన్నత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మంచి మార్గంలో పయనించాలని ఉద్బోధించారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం నేరమన్న విషయాన్ని గ్రహించాలన్నారు. సంఘ విద్రోహ కార్యాకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించి తమ తల్లిదండ్రులకు, తాము చదువుకుంటున్న కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, అధ్యాపకులు జి.శ్రీనివాసులు, డీసీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక


తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజోలు: జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు రాజోలుకు చెందిన క్రీడాకారులు జి.దినేష్ ఆదిత్య, కె.దివ్యతేజ వెంకటేష్‌లు ఎంపికైనట్టు కోచ్ ఆర్.మణికుమార్ శుక్రవారం తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఈ పోటీలు కాకినాడ ఏఎస్‌డీ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహించినట్టు వివరించారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

వాలీబాల్ పోటీల్లో చాందిని ప్రతిభ

అంబాజీపేట: రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ విభాగంలో ముక్కామల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మోరంపూడి చాందిని పాల్గొని ప్రతిభ కనబర్చిందని హెచ్ఎం ఎంఎస్ఆర్.మూర్తి తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆమెను ఉపాధ్యాయులు, శుక్రవారం అభినందించారు. 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అనంతపురం, హిందూపురంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున చాందిని పాల్గొందన్నారు. తర్ఫీదునిచ్చిన పీడీ ముత్యాల పవన్‌కిషోర్‌ను, చాందినిని, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అభినందించారు.

పవిత్రోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు


పవిత్రోత్సవాలకు ఆలయంలో చేసిన ఏర్పాట్లు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి పవిత్రోత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని మామిడితోరణాలతో ముస్తాబు చేశారు. భారీ ఎత్తున షామియానాలు ఏర్పాటు చేశారు. పవిత్రోత్సవాల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో వేదికను తీర్చిదిద్దారు. పవిత్రోత్సవాల కోసం ఆలయం సర్వహంగులతో కొత్త శోభను సంతరించుకుంది. 26వ తేదీ శనివారం ఉదయం విశ్వక్సేనారాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 26వ తేదీ పుణ్యాహవచనం, పరిషత్ దక్షిణ, రుత్విక్ వరుణ, రక్షాబంధనం, అంకురార్పణ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ఆదివాసం, శ్రీవారికి నవ కలశ స్నపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 27వ తేదీ ఆదివారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 28వ తేదీ సోమవారం శ్రీవారి శాంతి కల్యాణంతో ఉత్సవాలు సంపూర్ణమవుతాయని తెలిపారు.

ఏజీపీగా న్యాయవాది విద్యా ప్రసన్న

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా ప్రముఖ న్యాయవాది బూసి విద్యా ప్రసన్న నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆమె మూడేళ్ల పాటు విధులు నిర్వహించనున్నారు. పేద ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు తమవంతు కృషి చేస్తానని ఏజీపీగా ఎంపికైన విద్యా ప్రసన్న అన్నారు. న్యాయవాది విద్యా ప్రసన్నను ఏజీపీగా ఎంపిక చేయడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

మలికిపురం: అడవిపాలెంలో శుక్రవారం వివాదాస్పద పంచాయతీ స్థలాన్ని సర్వే చేస్తుండగా జరిగిన కొట్లాటలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈ పంచాయతీ సర్వే స్థలాన్ని సర్వే చేయాలని ఒక వర్గం పట్టుబడుతుండగా, మరో వర్గం దాన్ని వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు వర్గాలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్చలు నిర్వహించి సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం సర్వే నిర్వహిస్తుండగా కొట్లాట జరిగింది. సర్వే వద్దకు సంబంధం లేని వ్యక్తులు వచ్చారని ఒక వర్గం వాదనకు దిగడంతో ఈ ఘటన జరిగింది. కొట్లాటలో గ్రామానికి చెందిన కందికట్ల శశికుమార్, యడ్ల రత్తాలు గాయపడ్డారు. వీరిద్దరినీ రాజోలు ఆసుపత్రికి తరలించారు. సీఐ నరేష్, ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

పశువుల వివరాల నమోదు

మామిడికుదురు: ప్రతి రైతు తమ పశువుల వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలని సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం పశు గణన కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే ఏడాది పిబ్రవరి 28వ తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దీనిలో భాగంగా సిబ్బంది ప్రతి రైతు ఇంటికీ వచ్చి పశువుల వివరాలు నమోదు చేస్తారన్నారు. రైతులు పశు సంవర్థక శాఖ ఉద్యోగులకు పాడి రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు. దీనిలో నమోదైన వారికి మాత్రమే పథకాలు అందజేస్తారని తెలిపారు.

పశుగణన సర్వేకు ఏర్పాట్లు

అంబాజీపేట: అఖిల భారత పశుగణన సర్వేను మండలంలో పక్కాగా నిర్వహించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద పశుగణన పోస్టర్లను పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 వరకు పశుగణన నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి గేదెలు, ఆవులు, మేకలు, కుక్కలు, పందులు, కోళ్ల తదితర 16 రకాల పెంపుడు జంతువుల వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. పశువైద్యాధికారులు జీఆర్ఎస్ఎస్.శ్రీనివాస్, వి.దీపిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.